

లక్షలు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలి
● నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్న భవనాలు 6
● పట్టించుకోని అధికారులు

భయం.. వీడితేనే విజయం 7
● సమీపిస్తున్న పరీక్షలు
● ఒత్తిడిలో విద్యార్థులు





భూ కబ్జాపై చర్యలు షురూ..!

భూమిలో సర్వే జరుపుతున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

- ఏజెన్సీ భూమిని కస్టడీకి తీసుకోనున్న అధికారులు
- తహసీల్దార్‌కు ఐటీడీఏ పీవో ఆదేశాలు
- పోలీస్ బందోబస్తు మధ్య స్వాధీనానికి సన్నాహాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన అక్రమాల డొంక

మంచిర్యాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామంలో గిరిజన (ఏజెన్సీ) భూములను కబ్జా చేయడమే కాకుండా, అందులో అక్రమంగా రైస్ మిల్లు ఏర్పాటు చేసిన ఘటనపై ఎట్టకేలకు చర్యలు ప్రారంభమయ్యాయి. భూమిని స్వాధీనం చేసుకోవాలని ఉట్నూరులోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్త గురువారం మండల తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీసు బందోబస్తు నడుమ కబ్జాకు గురైన భూమిని ప్రభుత్వ కస్టడీకి తీసుకునేందుకు రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 'ఏజెన్సీ భూమి కబ్జా' శీర్షికన నవంబరు 12న 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో కథనం ప్రచురితమైంది. కథనంపై స్పందించిన ఐటీడీఏ పీవో మరునాడు దండేపల్లి మండల తహసీల్దార్‌కు సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశాలు జారీ చేశారు.

కబ్జా జరిగిందిలా....

ముత్యంపేట గ్రామం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ గిరిజన చట్టాలైన 1/70, పేసా చట్టాలు అమలులో ఉన్నాయి. అయినప్పటికీ గిరిజనేతరులైన ఇద్దరు బడా వ్యక్తులు భూములను కబ్జా చేశారు. సర్వే నెంబరు 17లో 34 గుంటలతోపాటు దాని సమీపంలోని సర్వే నెంబరు 18లో మరో ఆరు గుంటల భూమిని కబ్జా చేసిన ఓ బడా వ్యాపారి ఏకంగా రైస్‌మిల్లు నిర్మించాడు. ఏజెన్సీ భూమి కబ్జా పర్వాన్ని 'ఆంధ్రజ్యోతి' కథనం ద్వారా వెలుగులోకి తెచ్చింది. ముత్యంపేట గ్రామంలో ఏజెన్సీ భూములను గిరిజనేతరులు ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా, కనీసం గ్రామ పంచాయతీ ట్రేడ్ లైసెన్స్ కూడా పొందకుండా మినీ రైస్‌మిల్లు ఏర్పాటు చేశాడు. అయితే అదే భూమిని ఉట్నూరులోని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఇళ్లు లేని పలువురు గిరిజనులకు ఇంటి స్థలాల కోసం కేటాయిస్తూ గతంలో ఆదేశాలు జారీ చేశారు. పీవో ఆదేశాల మేరకు భూమిని ఇళ్లు లేని పేదలకు పంచాల్సి ఉండగా, స్థానిక రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి అన్యాక్రాంతం అయ్యాయి. ఈ విషయమై గ్రామస్థులు కొందరు అక్టోబరు 28న కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా రు. అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ సూచనల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ నవంబరు 26న అక్రమంగా రైస్ మిల్లు ఏర్పాటు చేసిన స్థలంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. లేఖ ఇచ్చిన నాటి నుంచి గరిష్ఠంగా 7 రోజుల లోపు నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. అడిషనల్ కలెక్టర్ ఇచ్చిన గడువు ముగియడం, రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో గ్రామస్థులు డిసెంబరు 11న ఉట్నూరు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను కలిసి ఏజెన్సీ భూమిని కాపాడాలని ఫిర్యాదు చేశారు.

పీవో ఆదేశాలతో కదిలిన యంత్రాంగం....

ఓ వైపు కలెక్టర్, మరోవైపు ఐటీడీఏ పీవో ఆదేశాలు ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో మండల రెవెన్యూ యంత్రాంగం కదిలింది. జనవరి 2న మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భూమన్న, సర్వేయర్ వినోద్, తదితరులు సదరు భూముల్లో సర్వే జరిపారు. విచారణలో సర్వే నెంబరు 17లో మొత్తం 1.12 ఎకరాల ఏజెన్సీ భూములు..

(తరువాయి 7వ పేజీలో)

ఉపాధి హామీ పథకం రికార్డుల పరిశీలన

తాండూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం రికార్డులను గురువారం స్టేట్ రీసోర్స్ పర్సన్ దేవేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ విడత జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో భాగంగా ఉపాధిహామీ నిధుల ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ చేయడానికి సోషల్ ఆడిట్ అధికారులను రికార్డులను పరిశీలిస్తామన్నారు.. మండలంలోని 14 గ్రామాల్లో చేపట్టిన పనుల్లో కూలీల పేర్లను హాజరు పట్టికలో ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో సరిగ్గా నమోదు చేశారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈపవో నంద కుమార్, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● కలెక్టర్ కుమార్ దీపక్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నెన్నెల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యసేవలు అందిచాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించారు. ఖాళీ పోస్టులు, సిబ్బంది గూర్చి ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైన మందులను నిల్వ ఉంచుకోవాలన్నారు. అనంతరం నెన్నెల, ఘన్‌పూర్, జోగాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో ఎంఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మార్చిలోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో, మరుగుదొడ్లు, తాగు నీటి సౌకర్యం, కిచెన్ షెడ్లు, ప్రహారి ఉండేలా చూడాలన్నారు. పూర్తి చేసిన పనులను రికార్డు చేసి వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. అవసరమైనచోట పనులకోసం ప్రతి పాదనలు పంపిస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తామ న్నారు. పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్నివిధాల సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు టీచర్లు కృషి చేయాలన్నారు. నాణ్యమైన విద్యఅందిస్తే విద్యార్థులు తప్పకుండా వస్తారని పేర్కొన్నారు. ప్రతినెల పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటుచేసి వారి పిల్లల పురోగతిని ప్రత్యక్షంగా చూపిస్తే సర్కారు బడులపై నమ్మకం పెరుగుతుందని చెప్పారు. తరగతిగదుల్లోకి వెళ్లి పిల్లలతో మాట్లాడారు. విద్యార్థులతో పాఠాలు చదివించి వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. బోర్డుపై లెక్కలు చేయించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి, మెనూ అమలు గూర్చి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఘన్‌పూర్‌లో కిచెన్ షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆయన వెంట తహసిల్దార్ సబ్బ రమేష్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవోనరేష్ ఉన్నారు.

చెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కృష్ణకాంత్ ఆచార్య



నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర చెస్ ఉపాధ్యక్షుడు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పట్టణంలోని పాల చెట్టు ఏరియాకు చెందిన డింగిరి కృష్ణకాంతాచార్య నియమితులయ్యారు. గురువారం నియామక పత్రాన్ని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్‌ఉర్ రహమాన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చెస్ క్రీడ అభివృద్ధికి సంబంధించి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వానికి కూడా చెస్ క్రీడకు చేయూత ఇవ్వాలని కోరామన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఈ చెస్ క్రీడను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు త్వరలోనే శిక్షణ తరగతులను ప్రారంభించబోతున్నామన్నారు. పర్యవేక్షణను దృష్టిలో పెట్టుకొని అసోసియేషన్‌లో ఖాళీగా ఉన్న పదవులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు, ఆయనకు ఉన్న ఆసక్తిని చూసి ఈ పదవి కట్టబెట్టామన్నారు. ఈ సందర్భంగా ఆయన కృష్ణకాంతాచార్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా చెస్ అభివృద్ధి కమిటి చైర్మన్ ఈగ కనకయ్య పాల్గొన్నారు.

వర్గీకరణను అడ్డుకుంటాం



మంచిర్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న మాల సంఘం నాయకులు

గర్మిళ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని మాలసంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ తీర్మాణం ఏర్పాటు చేసి ఎస్సీ వర్గీకరణకోసం చర్చించడాన్ని వ్యతిరేకిస్తున్నామ న్నారు. అన్నదమ్ముల్లా కలిసిఉన్న మాల మాదిగలను విభజించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పబ్బం గడుపుకుంటున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాత ఇప్పటి వరకు 33 రాష్ట్రాల్లో కూడా వర్గీకరణ అమలు చేయలేదని అలాంటిది తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు ఇంత తొందర పడుతున్నారో తెలియడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీని మాలలే ముందుండి గెలిపించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, కుంబాల రాజేష్, మల్లయ్య, చిన్నయ్య, తిరుపతి, సమ్మయ్య, గోపి, చంద్రశేఖర్, సంజీవ్, సురేష్, రామన్న, రమేష్, శంకర్, భాస్కర్, రాజు, సారన్న, మోహన్ పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారుడికి సన్మానం



కరాటే క్రీడాకారుడిని సన్మానిస్తున్న నాయకులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన జాతీయ అంతర్జాతీయ కరాటే క్రీడాకారుడు పటాన్‌జమీల్‌ఖాన్‌ను పాత బస్టాండ్ వాసులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానిం చారు. ఇటీవల భారత క్రీడా రత్న అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించిన జమీల్ గురించి సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇలాంటి క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాత బస్టాండ్ వాసులు రమేష్, కనకయ్యగౌడ్, ఉదయరాజు, అంకం రాజ్‌కుమార్, శ్రీధర్, మహేష్, సాగర్, రవి, చంద్రకాంత్‌లు పాల్గొన్నారు. అదే విధంగా మంచిర్యాల జిల్లా అధనపు కలెక్టర్ మోతిలాల్ కూడా జమీల్‌ఖాన్‌ను అభినందించారు.

గూడెంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దండేపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో గురువారం స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో స్వామివారి చిత్రపటాలను, పూజా సామగ్రిని సత్యదేవుడి సన్నిధి ప్రధానాలయం వరకు వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య ప్రధాన ఆలయం వరకు తీసుకెళ్లి సత్యదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి నిత్యవిధి, ప్రబోదిక ఆరగింపు, తీర్థ ప్రసాదాల గోష్టి, విశ్వకేనాధారణ, దీక్ష కంకణధారణ ప్రత్యేక కార్యక్రమాలను ఘనంగా జరిపించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన రఘుస్వామి, సంపత్‌స్వామి, సురేష్‌స్వామి, వేద పండితులు దుద్దిళ్ల నారాయణశర్మ వేదమంత్రోచ్చారణల మధ్య బ్రహ్మోత్సవ కార్యక్రమాల పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని బ్రహ్మోత్సవాలను తిలకించారు. ప్రధాన ఆలయ ప్రాంగణంలో సప్తహ భజన మండపంలో స్వామి వారిని ప్రతిష్ఠించి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు, భజనపరులు, సిబ్బంది పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా స్వామి చిత్రపటంతో వస్తున్న ఆలయ అధికారులు,అర్చకులు, సిబ్బంది



గూడెం ప్రధానాలయం వద్ద నిరంతర సప్తాహ భజన

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

లక్సెట్టిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హన్మకొండలో ట్రాఫిక్ పోలీ సులు వరంగల్ బార్ అసోసియేషన్ సభ్యుడైన గందం శివపైన చేసినదాడికి నిరసనగా లక్సెట్టిపేట న్యాయస్థానంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేసారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ రోజు రోజుకూ న్యాయవాదులపై దాడులు తీవ్రమవుతున్నాయని న్యాయ వా దులకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. హన్మకొండలో న్యాయ వాది శివపై దాడిచేసి దూశించిన ఇన్‌స్పెక్టర్ సీతారాంరెడ్డి బృందంపై వెంటనే చర్యలు తీసుకోవాలని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, కేతిరెడ్డి భూంరెడ్డి, గోవింద్‌రావు, అక్కల శ్రీధర్, సురేందర్, కొమిరెడ్డి సత్తన్న, కారుకూరి సురేందర్‌తోపప ఆటు న్యాయవాదులు పద్మ, కూడెల్లి అశోక్, ప్రకాశం, ప్రదీప్ ఉన్నారు.

వర్గీకరణలో నేతకాని కులానికి అన్యాయం..

● నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు

నస్పూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వర్గీకరణలో నేతకాని కులానికి అన్యాయం జరిగిందని, నేతకాని కులానికి ప్రత్యేక క్యాటగిరి ఏర్పాటు చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సునర్కర్ రాంబాబు డిమాండ్ చేశారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో ఏ,బి,సీ లుగా ఏర్పాటు చేసి గ్రూపులో నేతకాని కులాన్ని సీ గ్రూప్‌లో ఉంచి తీరని న్యాయం చేసిందన్నారు. ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలు చేయాలని, వర్గీకరణలో నేతకానిలకు న్యాయం చేసి ప్రత్యేక కేటగిరిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపా,ధ్యక్షుడు జాడి రామ్ చందర్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు అన పర్తి యువరాజ్, మహిళా ఉపాధ్యక్షురాలు గోలేటి లక్ష్మి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కామెర అనూష, నేతకాని స్టూడెం ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జుమ్మిడి గోపాల్, జిల్లా అధికారి ప్రతినిధి కొండగొర్ల శ్రీనివాస్, నాయకులు శివరాం, లక్ష్మీరాజం, విగ్నేష్, రాజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


● జిల్లా సైన్స్ అధికారి మధుబాబు

జైపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థి కష్టపడి కాదు ఇష్టపడి చదవాలని జిల్లా సైన్స్ అధికారి ఎస్. మధుబాబు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని జైపూర్‌లోని కేజీబీవీ బాలికల పాఠ శాలలో వివిధరకాల సైన్స్ కృత్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతిని చూసి మానవుడు నేర్చుకోవాలన్నారు. మానవుని మనుగడ కోసం పోరాటమే మానవ ప్రగతికి సోపానం అన్నారు. పక్షులకు ఆర్కిటెక్చర్ గూడు కట్టడం ఎవరు నేర్పించారో ఆలోచించాలన్నారు. విద్యార్థులు ప్రకృతిని చూసి తెలియని విషయాలను తెలుసుకునేలా ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ప్రతి విషయాన్ని ప్రాక్టీస్ చేయడం ద్వారానే విద్యార్థి మదిలో ప్రతి అంశం నిలిచి ఉంటుందన్నారు. బెర్నోలి సూత్రాలు, తరంగాలు, ధ్వని ఎలా ప్రసరిస్తుంది, ఇనుప మొల లపై కూర్చోవడం, కరెంటు బల్బులపై నిల్చోవడం, అరచేతిలో కొబ్బరి కాయ నిల్చోవడం, నీల్లు ఉన్న కిటుకు, అభి కేంద్ర, అపకేంద్ర బలాలపై విద్యార్థుల భాగస్వామ్యంతో 30కి పైగా చేసిన కృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఫణిబాల, జిజ్ఞాస మొబైల్ సైన్స్ ల్యాబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, ఉపాధ్యాయురాలు భారతి దేవీ, పద్మ, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

జైపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేలాల గ్రామంలో ఈ నెల 26 నుంచి 28వరకు జరిగే జాతర కోసం ఈ నెల 8న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వేలాల గ్రామ ప్రత్యేకాధికారి, ఆర్‌డ బ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ పేర్కొన్నారు. బోల్ పేలాలకు దరావత్తు రూ. 5వేలు, పార్కింగ్ కోసం రూ.10 వేలు, కొబ్బరికాయల విక్రయ కోసం రూ. 10 వేలు, లడ్డు విక్రయం కోసం రూ. 10 వేలు నగదు రూపంలో చెల్లించిన తర్వాతనే వేలం పాటలో పాల్గొనవచ్చుని, బ్యాంకు చెక్కులు, డీడీలు అంగీకరించబడవన్నారు. గత సంవత్సరం, ఈ సంవత్సరం గ్రామ పంచాయతీకి బకాయిలు ఉన్న వారు వేలం పాటలో పాల్గొనేందుకు అనర్హులన్నారు. వేలం పాటలో హక్కులు పొంది ఎత్తు పాట దారు వేలం పాట ముగిసిన వెంటనే డిపాజిట్ సొమ్ము పోను సగం డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. మిగిలిన సొమ్ము వేలం పాట ముగిసిన 24 గంటల్లో చెల్లించాలన్నారు. చెల్లించకపోతే పాటను రద్దుచేసి డిపాజిట్ సొమ్ము, చెల్లించిన సొమ్ము గ్రామపంచాయతీ పేరిట జప్తు చేయబడుతుందని తెలిపారు.

మిలిటరీ విభాగంలో శిక్షణ తరగతులు



కార్పొరేషన్ మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ ప్రోగాంలో పాల్గొన్న మేనేజర్

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల మునిపల్ కార్పొరేషన్‌లో గురువారం మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ విభాగంలో ప్రత్యేక ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మంచిర్యాల ము న్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాన్ని మంచిర్యాల కమిషనర్ శివాజీ, మేనేజర్ విజయ్‌కుమార్ మంచిర్యాల అభివృద్ధిపై వివరించారు. కాలేజీ రోడ్డులో గల మహా ప్రస్తాన పనులతో పాటు మంచిర్యాల మాతా శిశు ఆసుపత్రి కేంద్ర నిర్మాణ పనులను వివరించారు. అంతే కాకుండా మున్సిపాలిటీలో ప్రాథమిక సౌకర్యాలు, వ్యర్థాలనిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనలతో పాటు ప్రజల ఫిర్యాదులు, వాటి పరిష్కారం, ఆరోగ్య కేంద్రాల సందర్శన వంటి వాటిపై వివరించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

గర్మిళ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు రానున్న పరీక్షల్లో భయాన్ని వీడి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని లైఫ్ కోచ్ ఆర్ఎల్ రామ్ అన్నారు. గురువారం మంచిర్యాలలోని రాజీవ్‌నగర్ మోడల్ స్కూల్‌లో యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు వస్తుంటాయని వాటిని సమర్థవంతంగా ఎదుర్కొ నేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. పరీక్షలంటే భయం వద్దని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుచ్చన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- ప్రకాష్, ఎంఈవో



ఆంధ్రజ్యోతి: పదోతరగతి విద్యార్థులకు పరీక్షల కోసం ఎలా సిద్ధం చేస్తున్నారు?

ఎంఈవో: ఉదయం సాయంత్రం ప్రత్యేకతరగతులు నిర్వహిస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ ఎలా ఉంది?

ఎంఈవో: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ బాగుంది. నూతన మెనూ ప్రకారం భోజనం పెడుతున్నాం. సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ సైతం అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు?

ఎంఈవో: గ్రామస్థులు లిఖిత పూర్వకంగా రాసి ఫిర్యాదు చేస్తే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: అమ్మ ఆదర్శ పాఠశాల పనులు ఎలా నడుస్తున్నాయి?

ఎంఈవో: మండల వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ఆయా పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతులను గుర్తించి పనులు చేపడుతున్నాం. పనులు తది దశకు వచ్చాయి.

- కెరమెరి(ఆంధ్రజ్యోతి)

దేశీదారు పట్టివేత

సిర్పూర్(టి), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని గోండ్‌పిప్రి నుంచి గురువారం అక్రమంగా గోండ్‌పిప్రి గ్రామానికి చెందిన చందు ద్విచక్ర వాహనంపై 253 దేశీదారు సీసాలను తీసుకు వస్తుండగా అందిన సమాచారం మేరకు ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఈ మేరకు ద్విచక్ర వాహనం సీజ్ చేసి దేశీదారు బాటిళ్లను స్వాధీనపర్చుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

లక్షలు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలి..



శిథిలావస్థకు చేరుకున్న బీసీ వసతి గృహ భవనం

- నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్న భవనాలు
- పట్టించుకోని అధికారులు

లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు వృథాగా ఉన్నాయి. ఏళ్లుగా వినియోగించకపోవడంతో శిథిలం అవుతున్నాయి. కనీసం చిన్నచిన్న మరమ్మతు పనులు కూడా చేపట్టక ఏళ్ల తరబడి వాటిని వదిలేయడంతో దెబ్బతింటున్నాయి. చివరకు నిర్వహణకు పనికిరాకుండా పోయే పరిస్థితులు ఉన్నాయి.

వాంకిడి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్సీ బాలిక వసతి గృహం ఉండేది. విద్యార్థినుల సంఖ్య తగ్గడంతో కొంతకాలం క్రితం ఇక్కడి నుంచి వసతి గృహాన్ని తీసివేశారు. లక్షల రూపాయలతో నిర్మించిన వసతిగృహం భవనాన్ని అధికారులు వృథాగా వదిలివేశారు. ఈ భవనంలో విద్యార్థినులకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు, మంచినీటి వసతి, విశాలమైన గదులు ఉన్నాయి. ఇక్కడి నుంచి వసతి గృహాన్ని తీసివేడంతో దాదాపు 12సంవత్సరాల నుంచి ఈ భవనం నిరుపయోగంగా ఉంది. కొంత కాలం నుంచి ఈ భవనం పక్కనగల గిరిజనబాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు తరగతుల నిర్వహణ కోసం రెండు, మూడు గదులను ఉపయోగిస్తున్నారు. భవనానికి గేటు లేకపోవడంతో అసాంఘిక కార్యకలా పాలకు అడ్డాగా మారింది. కొన్నేళ్ల నుంచి ఈ భవనం వృథాగా ఉన్నప్పటికి ఉన్నతాధికారులు భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో లక్షలరూపాయల ప్రభుత్వ ధనం వృథాఅవుతోంది. భవనానికి గేటు ఏర్పాటు చేసి తలుపులకు చిన్న మరమ్మతులుచేస్తే ఉపయోగంలోకి వస్తుంది.

ఆశ్రమ పాఠశాల కొనసాగితే..

ఈ భవనం పక్కన ఉన్న గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా గదు లు, మరుగుదొడ్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనాన్ని గిరిజన ఆశ్రమ పాఠశాల నిర్వహణకోసం ఉపయోగిస్తే విద్యార్థులకు అన్నివిధాల సౌకర్యంగా ఉంటుంది. ఇటీవల గిరిజన ఆశ్రమ పాఠశా లలో అనారోగ్యంతో దాదాపు 60మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా ఒక విద్యార్థిని మృతి చెందింది. పాఠశాలను సందర్శించిన జిల్లా ఉన్నతాధికారులకు పక్కన ఉన్న ఎస్సీవసతి గృహం గిరిజన ఆశ్రమ పాఠశాల కోసం ఇవ్వాలని ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఉన్నతాధికారులు వృథాగా ఉన్న ఈ భవనాన్ని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాల నిర్వహణకు ఇచ్చి ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన వ్యవసాయ కార్యాలయం

వ్యవసాయ శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయం భవనంపై పెచ్చులు ఊడి వర్షాకాలంలో నీరు భవనంలోకి వస్తున్నాయి. దీంతో పాటు గోడలకు పగుళ్లు ఏర్పడడంతో ఎప్పుడు కూలిపోతుందో అన్న భయందోళనతో వ్యవసాయ శాఖ అధికారులు తమ కార్యాలయాన్ని వాంకిడి రైతు వేదికలో నిర్వహిస్తున్నారు. రైతువేదికలో సరైన వసతులు లేకపోవడంతో వ్యవసాయ అధికారి, ఏఈవోలు ఇబ్బందులకు గురవుతున్నారు.

● బీసీ వసతిగృహం భవనం అంతే...

మండల కేంద్రంలోని బీసీ వసతి గృహం భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. గోడలు పగుళ్లు తేలి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉండడంతో రెండు సంవత్సరాల నుంచి బీసీ వసతిగృహాన్ని ఎస్సీ వసతిగృహంలోనే కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఎస్సీ, బీసీ వసతిగృహాలు ఒకేభవనంలో కొనసాగుతుండడంతో విద్యార్థులకు, వంటల నిర్వహణకు ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో ఎస్సీ వసతి గృహంలోను వర్షం నీరు ఉరుస్తుండంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతుంటారు. బీసీ వసతిగృహం కోసం నూతన భవనానికి రెండు సంవత్సరాల క్రితం అధికారులు ప్రతిపాదనలు పంపించినా ఇప్పటి వరకు నూతన భవనం నిర్మాణానికి నోచుకోలేదు. సంబంధిత అధికారులు బీసీ వసతి గృహంకోసం నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహం



శిథిలావస్థకు చేరుకున్న వ్యవసాయ కార్యాలయం

పది ఫలితాల్లో జిల్లాను ముందంజలో నిలపాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి





మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, టాస్క్ కేంద్రాన్ని సందర్శిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక ఫలితాల్లో జిల్లాను ముందంజలో నిలపాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ఎస్‌వోలు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో పదవ తరగతి వార్షిక పరీక్షలల్లో ఉత్తమ ఫలితాల సాధన దిశగా చేపట్టాల్సిన చర్యలపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పదోతరగతిలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలపాలని, విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వార్షిక పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని, ఎలాంటి ఒత్తిడి, అపోహలు లేకుండా ఏకాగ్రతతో చదవాలన్నారు. మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ లాంటి సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు సాయంత్రం, ఉదయం అదనపు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ప్రతీరోజు అయిదు పాఠశాలలను సందర్శించాలని, ప్రధానోపాధ్యాయులు తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయుల బోధన సరళని పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల కమిషనర్ ఉదయ్‌బాబు, సమన్వయకర్త శ్రీనివాస్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఎస్‌వోలు , ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ డెవలప్‌మెంట్(టాస్క్) కేంద్రంలో అభ్యర్థులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టాస్క్ సెంటర్‌ను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ డెవలపమెంట్ సెంటర్ ఆధ్వర్యంలో అందిస్తున్న నైపుణ్య శిక్షణను వినియోగించుకుని భవిష్యత్‌లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టాస్క్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తిర్యాణి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మిగణపతి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం కుంకుమార్చన, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతర మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్, వెంకటేశం, సకారాం, రంజిత్, శ్రీకాంత్, మహేష్, సాగర్, రాజు, కుమార్, నేష, సాయి, చందన్, ప్రదీప్, సంతోష్‌గౌడ్, శ్యాం, గౌతమ్, నరేష్, అర్చకులు శివప్రసాద్, చంద్రమౌళి పాల్గొన్నారు.

సమ్మక్క మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా గురువారం కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో ఉన్న సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర కమిటీ ఆధ్వర్యంలో భక్తులు అన్నీ వసతులు కల్పించినట్టు జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్ తెలిపారు.



క్యారమ్స్‌లో సింగరేణి జట్టు సత్తా

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ పట్టణంలో నిర్వహించిన ఆల్ ఇండియా కోల్ ఫీల్డ్ క్యారమ్స్ పోటీల్లో సింగరేణి జట్టు సత్తా చాటింది. ఈ పోటీల్లో మొత్తం 10 బొగ్గు కంపెనీలకు చెందిన జట్లు పాల్గొనగా, సింగరేణి జట్టు చక్కటి ప్రదర్శనతో టీమ్ చాంపియన్‌షిప్ సాధించింది. క్యారమ్స్ డబుల్స్ విభాగంలో భూపాలపల్లి ఏరియాకు చెందిన శ్రీనివాస్, బెల్లంపల్లి ఏరియాకు చెందిన మల్లేష్ రన్నర్స్‌గా నిలిచారు. క్యారమ్స్ సింగిల్స్ విభాగంలో శ్రీరాంపూర్ ఆర్‌కే 6కు చెందిన జనరల్ మజ్దూర్ ఆర్. సృజన్‌రావు గోల్డ్‌మెడల్ సాధించాడు. అధికారులు, క్రీడాకారులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎంపీఎఫ్ స్లిప్పులు 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాల ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రాగం రాజేందర్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఈర్ల సదానందం, ఆర్గనైజింగ్ కార్యదర్శి మిట్టపల్లి మొగిలి, కిశోర్, రాజు, కిషన్, కాంట్రాక్టు కార్మిక సంఘం కన్వీనర్ కవేన స్వామి, తదితరులు పాల్గొన్నారు.

'అనారోగ్య కార్మికులపై యాజమాన్యం వివక్ష'

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తూ అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్‌మెన్స్‌పై యాజమాన్యం వివక్ష చూపుతోందని హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ తెలిపారు. గురువారం యూనియన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 20 ఏళ్లుగా అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్ సిబ్బందితో పాటు పిట్టర్, ఎలక్ట్రిషియన్, టెక్నీషియన్స్ గుండెసంబంధించి స్టంట్ పడి, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులను జాబ్ ప్రొటెక్షన్ లేకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. సింగరేణిలో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా టెక్నికల్ మైనింగ్ సిబ్బందికి ఉపరితలంపై అదే ఉద్యోగాలు కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపతామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెల్దె సుదర్శన్, చొప్పరి రామస్వామి, అశోక్ కుమార్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమే ప్రాణాలు తీసింది

- రూ.5 లక్షల సుపారితో మమతను హతమార్చారు - మృతదేహం చూపించి 4లక్షలు తీసుకున్న కిరాయి హంతకుడు

- హత్య కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్

చొప్పదండి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మమత హత్యకేసును పోలీసులు ఛేదించారు. జనవరి 27న కరీంనగర్-జగిత్యాల రహదారి గంగాధర మండలం కురిక్యాల శివారులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుర్తుతెలియని మహిళ మృతదేహం మంచిర్యాల జిల్లాకు చెందిన మేడ మమత(25)గా బంధువులు గుర్తించారు. కట్టుకున్న భర్తతో విభేదించి కొడుకుతో వేరేచోట ఉంటున్న మమత మరోవ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. చివరకు అతడి కుటుంబ సభ్యుల సుపారితో హత్యకు గురైంది. కొడుకును అనాథను చేసింది. చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ మమత భర్తతో మనస్పర్థలు వచ్చి మంచిర్యాల తిలక్‌నగర్‌లో తెలిసిన వారి ఇంట్లో ఉంటూ క్యాటరింగ్ పని చేస్తోంది. మమత కొంతకాలంగా కులుమల్ల భాస్కర్ అనే వ్యక్తితో సన్నితంగా ఉంటూ సహజీవనం చేస్తోంది. రామకృష్ణాపూర్‌కు చెందిన భాస్కర్ సింగరేణి ఉద్యోగి. భాస్కర్ జీతాన్ని మమతకే ఇస్తుండటంతో అతడి కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలిసింది. ఈ విషయంలో భాస్కర్‌ను కుటుంబసభ్యులు పలుమార్లు మందలించినప్పటికీ అతను మారలేదు. మమతకు భాస్కర్‌ను దూరం చేయాలని అతడి సోదరి నర్మద, తండ్రి రాయలింగు, బావ వెంకటేష్, మరోవ్యక్తి రఘుతో కలిసి పథకం రచించారు. మమతను హత్య చేసేందుకు కిరాయి హంతకుడు వేల్పుల కల్యాణ్‌తో ఐదులక్షల రూపాయలకు సుపారి ఒప్పందం చేసుకున్నారు. దీనికి గాను బయానాగా 60వేల రూపాయలు ముట్టజెప్పారు. రంగంలోకి దిగిన కల్యాణ్ పథకం ప్రకారం మమతను వారం రోజుల పాటు అనుసరించాడు. ఆమెతో పరిచయం పెంచుకుని అవసరానికి డబ్బులు ఇచ్చి మచ్చిక చేసుకున్నాడు. జనవరి 25న కారు కిరాయికి తీసుకున్నాడు. ఆమెను నమ్మించి కొడుకుతోపాటు బయటకు తీసుకెళ్లాడు. రాత్రి 10గంటల వరకు మంచిర్యాలలో తిప్పుతూ కారులోనే కత్తితో మెడపై గాయపరిచి, నైలాన్ తాడుతో గొంతు బిగించి హత్య చేశాడు. ఆ తరువాత భాస్కర్ సోదరి నర్మద, తండ్రి రాయలిం గు, వెంకటేశ్, రఘును పిలిపించి మమత మృతదేహాన్ని చూపించాడు. అనంతరం మిగతా నాలుగు లక్షల రూపాయలను తీసుకుని కారులో జగిత్యాల మీదుగా రాత్రి 11గంటలకు మమత మృతదేహాన్ని కురిక్యాల శివారులో కాలువ వద్ద పడేసి హైదరాబాద్‌కు బాబును తీసుకుని వెళ్లిపోయాడు.

జనవరి 27న హత్య విషయం వెలుగు చూడగా రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించగా సిల్వర్ కలర్ స్విఫ్ట్ డిజైర్ కారులో మమత ఎక్కినట్లు గుర్తించారు. కారు నంబర్‌తో నేరస్థుడు చెన్నైలోని ఓ హోటల్‌లో ఉన్నట్టు గుర్తించారు. పోలీసులు అక్కడికి చేరుకోగా నేరస్థుడు బాబును వదిలి పారిపోయాడు. బాబును తీసుకువచ్చిన పోలీసులు రెండురోజుల కిందట కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ నెల 5వ తేదీన గంగాధర మండలం వెంకటయ్యపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా మమత హత్యకేసు నిందితుడు వేల్పుల కల్యాణ్ అదుపులోకి తీసుకున్నారు. మమత హత్య కేసును ఛేదించిన చొప్పదండి సీఐ ప్రకాష్, ఎస్‌ఐ నరేందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ జంపయ్య, రామడుగు కానిస్టేబుల్ శ్రీధర్, ఐటీసెల్ కానిస్టేబుల్స్ ప్రదీప్, మహేందర్ తదితరులను ఉన్నతాధికారులు అభినందించారు.

ఉరి వేసుకుని డీ-ఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య



దహెగాం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగం మండలం పీపీరావు కాలనీలో ఉరి వేసుకుని డీ-ఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ ఉత్తం తెలిపిన వివరాల ప్రకారం... పీపీరావు కాలనీకి ఎందిన దుర్గం నితిన్(23) కరీంనగర్‌లోని శ్రీచైతన్య కాలేజీలో డీ-ఫార్మసీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తోటి మిత్రులతో కలిసి వైజాగ్ పర్యటనకు ఆదివారం వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. మధ్యలోనే ఇంటికి వస్తున్నా అని తిరిగి తల్లిదండ్రులకు ఫోన్‌లో చెప్పి బుధవారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా సోదరుడు మరో ఊరికి వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో నితిన్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోదరుడు ఊరికి వెళ్లి ఇంటికి చేరుకొని తలుపులు తీయగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడు నితిన్ తండ్రి సకారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

● కన్నీరు పెట్టించిన సూసైడ్ లేఖ..

'అమ్మా నాన్న నన్ను క్షమించండి.. మీరు నాకోసం చాలా చేశారు, కానీ నేను మీకు ఏమి చేయలేకపోతున్నాను.. కన్న కలలు కలలుగానే మిగిలి పోతున్నాయి.. నా చావుకు ఎవరు కారణం కాదు.. నాకు జీవితంపై విరక్తి చెంది చనిపోతున్నాను... మీరందరు కలిసి ఉండాలి.. నేను చేసింది తప్పే క్షమించండి' అని రాసిన లేఖ పలువురిని కంటతడి పెట్టించింది.

వెంటాడుతున్న పులి భయం

- కొత్త వరిపేటలో అడవి పందిపై పులి దాడి

కాసిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మొన్న దుబ్బగూడెం గ్రామ సమీపంలో పెద్దపులి సంచరిస్తుండగా బుధవారం రాత్రి కాసిపేట గోండుగూడ సమీపంలో పులి వీధి కుక్కపై దాడి చేసిందని గని కార్మికుడు తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో శివారు ప్రాంతాల ప్రజలు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. వారం రోజులుగా పెద్దపులి బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్ మండలాల సరిహద్దు అటవీ శివారు ప్రాంతంలో తిరుగుతూ ప్రజలను హడలెత్తిస్తోంది. గురువారం తెల్లవారుజామున కొత్త వరిపేట ఊరి సమీపంలోని చెరువు వద్ద అడవి పందిపై పులి దాడి చేసిన ఆనవాళ్లను స్థానికులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. కొన్ని రోజులుగా పెద్దపులి అడవి పందులను వేటాడుతోంది. రెండు రోజులుగా కనిపించకుండాపోయిన పెద్దపులి గురువారం కొత్తవరిపేటలో జాడ తెలిసింది. ఇదిలా ఉండగా కాసిపేట 2వ గనిలో బదిలీ వర్కర్‌గా పనిచేస్తున్న దేవేందర్‌రెడ్డి రెండవ షిఫ్ట్ విధులు ముగించుకుని రాత్రి కారులో వెళ్తుండగా గోండుగూడ స మీపంలోని రోడ్డుపై పెద్దపులిని చూశానని అది కుక్కపై దాడి చేసింద ని కార్మికులందరు అప్రమత్తంగా ఉండాలని తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని అటవీ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పులిని సంరక్షించేందుకు అటవీ శాఖ అధికారులు శ్రమిస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

భీమారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భీమారంలోని ఐటీడీఏ కాలనీకి చెందిన రాంటెంకి రంజిత్‌కుమార్ ఇంట్లో దొంగతనం జరిగింద ని భీమారం ఎస్ఐ శ్వేత తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం గత నెల 31న రంజిత్‌కుమార్ తన కొడుకు అక్షరాభ్యాసం కోసం సిద్దిపేటకు వెళ్లాడు. తిరిగి ఈ నెల 5న ఇంటికి రాగా తాళం పగుల గొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ. 50 వేల నగదు, రూ. 42 వేల విలువ గల బంగారం దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రంజిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



అధికారులు పట్టుకున్న బియ్యం

వాంకిడి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్‌జనగాం గ్రామం వద్ద బుధవారం రాత్రి 14.13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఘాట్ జనగాం వద్ద పీడీఎస్ బియ్యం అక్రమంగా లోడ్‌చేస్తున్న సమయంలో ఓ కారు(ఏపీ 25క్యూ 1955)ను పట్టుకోవడం జరిగిందని, ఈ వాహనంలో 14.13 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసి వాహనాన్ని వాంకిడి పోలీసుస్టేషన్‌లో అప్పగించామని తెలిపారు. వాహన డ్రైవర్ షేక్ మున్నా, యజమాని షేక్ ముస్తాఫ్ అలీపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో అధ్యాపకుడి మృతి



బంధం బాపురెడ్డి (ఫైల్)

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రాంనగర్‌కు చెందిన బంధం బాపురెడ్డి (50) అనే అధ్యాపకుడు గురువారం షటిల్ ఆడుతుండగా గుండెపోటుతో మృతి చెందా డు. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపురెడ్డి ఇంజనీరింగ్ కళాశాల లో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. కాలేజీ రోడ్డు గ్రౌండ్‌లో షటిల్ ఆడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. సహచర అధ్యాపకులు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చెన్నూరుకు చెందిన సతీష్ అనే వ్యక్తి బాపురెడ్డికి 15 నెలల క్రితం రూ. 20 లక్షలు అప్పుగా ఇచ్చాడు. కొంత కాలంగా అప్పుతీర్చాలని మనోవేదనకు గురిచేయడం వల్లనే బాపురెడ్డి గుండెపోటుతో మరణించాడని మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాపురెడ్డి మృతికి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

లక్సెట్టిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం వేరువేరుగా దాడులు జరిపారు. ఈదాడుల్లో తొమ్మిది మంది పేకాటరాయుళ్లు పట్టుబడగా మరో పదిమంది పరారీలో ఉన్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు. లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్సై సతీష్ సిబ్బందితో కలిసి దాడి చేసారు. ఈదాడిలో ఏడుగురు పట్టుపడగా వారి నుంచి 25,280రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.

● టాస్క్‌ఫోర్స్ దాడిలో

లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాటస్థావరంపై దాడి చేసారు. ముగ్గురు పేకాటరాయుళ్లు పట్టుబడగా వారి నుంచి 13,120రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఐదుగురు నిందితులు పరార్ అయ్యారు. పట్టుకున్న నగదుతోపాటు నిందితులను తదుపరి విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెల్లడించారు.

అట్రాసిటి కేసు నమోదు

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం చున్నం బట్టివాడకు చెందిన రవిందర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బెల్లంపల్లికి చెందిన ఆవుల సాయిబాబా మంచిర్యాల పట్టణం గర్మిళ్ల శివారులో రవిందర్‌రెడ్డి, గోదారి రవి కలిసి చేసిన వెంచర్‌లో రెండు ప్లాట్లు కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ గడువు పూర్తయింది. తనకు రిజిస్ట్రేషన్ చేయాలని జనవరి 30న సాయిబాబా రవిందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి డబ్బులు అడగడంతో అతనిని కులం పేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం సమీపిస్తున్నందున జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా నిరంతరం నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ పథకంలోని మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల్లోని వార్డులకు అవసరమైన మేరకు తాగునీటిని అందించాలని, పైపులైన్ల మరమ్మత్తులను గుర్తించి త్వరగా పూర్తి చేసి అంతరాయం లేకుండా సరఫరా చేయాలన్నారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, జెడ్పీటీసీవో గణపతి, పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్ పంపిణీ

కన్నెపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సుప్రజ పీపుల్స్‌ఫర్ పీపుల్ సంస్థ సభ్యులు గురువారం కన్నెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. సంస్థ అధ్యక్షుడు జన గామ అభిలాష్, ప్రధాన కార్యదర్శి నాగేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు సత్యం, రాజశేఖర్ పాల్గొన్నారు.

పత్తి కొనాలని రైతుల ధర్నా

చెన్నూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మండలంలోని కిష్టంపేట గ్రామ సమీపంలో ఉన్న వరలక్ష్మీ జిన్నింగు మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేపట్టాలని గురువారం రైతులు చెన్నూరు మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. రెండు రోజుల నుంచి పత్తి వాహనాలతో ఇక్కడే ఉన్నామని సీసీఐ అధికారులను అడిగితే నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ సెక్రటరీ రామాంజనేయులు సీపీవో అక్కడకు చేరుకుని పత్తి కొనుగోళ్లు చేపడతామని తెలుపడంతో రైతులు ధర్నాను విరమించారు. జిల్లా స్థాయి అధికారులు చొరవ తీసుకుని పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

భయం.. వీడితేనే విజయం



- సమీపిస్తున్న పరీక్షలు
- ఒత్తిడిలో విద్యార్థులు

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పరీక్షల సమయం సమీపిస్తున్నాయి. ఇప్పటికే ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభ మయ్యాయి. దీంతో విద్యార్థులు ఒత్తిళ్లకు లోనవుతున్నారు. ముఖ్యంగా పదోతరగతి విద్యార్థులు జీపీఏ సాధించడంకోసం ప్రయత్నిస్తున్నారు. 10/10సాధించాలని తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు వారిపై ఒత్తిడి పెంచడంతో విద్యార్థులు ఎక్కువగా ఒత్తిడికి గురవుతున్నారు. అలాగే ఇంటర్ విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించడంతో పాటు మెయిన్స్ ఎగ్జామ్స్‌తో పాటు ఎంసెట్‌లో ర్యాంకులు సాధించాలని, పదే పదే అధ్యాపకులు ఒత్తిడికి గురిచేయడంతో విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధిస్తామో లేదో అనే ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు ప్రతీ రోజు తమ లక్ష్యాన్ని చేరేం దుకు ప్రణాళికబద్ధంగా చదివితే లక్ష్యాలను చేరుకో గలరు. కానీ ఎక్కువమంది విద్యార్థులు సోషల్ మీడియాకు, సెల్‌ఫోన్‌లకు ఆకర్షితులు అవడంతో వారి లక్ష్యాల చేరువకు రాలేకపోతున్నారు. ఇంటివద్ద పిల్లలు ఏం చేస్తున్నారన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించకపోవడం కూడా పిల్లలు చెడిపోయేందుకు ఒక కారణం. కేవలం పరీక్షల సమయంలోనే విద్యార్థులను బాగా చదివాలి, జీపీఏ సాధించాలని, ర్యాంకులను సాధించాలని ఒత్తిడి చేయడంతో ఫలితాలను ఆశించిన మేరకు సాధించలేకపోతున్నారు. ఏది ఏమైనా బతికి సాధించాలి కానీ ప్రాణాలు తీసుకుంటే ఏం సాధించినట్లు అని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచంలో అన్నింటి కన్నా విలువైంది జీవితం. ఇందులో వైఫల్యాలు సాధారణం. బతికి ఉంటే దేనినైనా సాధించగలం. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించుకోగలం అనుకోవడంలో తప్పు లేదు. అదే సర్వస్వం అన్న భావనను మనసులో నుంచి తొలగించుకొని ప్రతీ సమస్యకు పరిష్కారం ఉందనే విషయాన్ని మరిచి కొంత మంది విద్యార్థులు ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా కన్నవారికి కడుపు కోతను మిగులుస్తున్నారు. బతికి సాధిద్దాం అనే సంకల్పం ఉంటే ఎంతటి ప్రతికూలతనైనా మనం అనుకూలంగా మార్చుకొని ముందుకు సాగితే జీవితం సాఫీగా సాగుతుంది.

పరీక్షల సమయంలో సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటేనే..



నేటి తరం విద్యార్థులు చదువుకునే సమయంలో సెల్‌ఫోన్‌లకు, సోషల్ మీడియాకు, అలవాటు పడి సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. దీంతో పరీక్షా సమయం ముంచుకొచ్చి అయ్యో నేనేం చదవలేకపో యా. మంచి మార్కులు వస్తాయో లేదోనని ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఒత్తిడిలోనే ఆత్మహత్యకు పాల్ప డి నిండు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఉపా ధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు చదు వుతున్నారా లేదా అనే విషయాన్ని ఎప్పటికి పరిశీ లించి వారిని చదివే విధంగా ప్రోత్సహిస్తే మంచిది.

- మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ బాలిక (12) గత సంవత్సరం నవంబర్‌లో చదువులో వెనుక బడ్డానన్న కారణంగా ఆత్మహత్యకు పాల్పడడం అందరిని కలిచివేసింది. అప్పటికీ ఆమె చదువుతున్నది ఏడో తరగతి మాత్రమే.
- మంచిర్యాల పట్టణం సీసీసీలో ఓ బాలిక (15) చదువులో రాణించడం లేదన్న కారణంగా శుక్ర వారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పదోతరగతి పరీక్షలో పది జీపీఏ సాధిం చలేనని ఒ త్తిడికి లోనై తనువు చాలిస్తున్నట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొనడం అందరిని ఆలోచింప జేసింది.

విజయాలు..అపజయాలు సాధారణం



ప్రపంచంలో అన్నింటికన్నా విలువైంది జీవితం. ఇందులో విజయాలు, అపజయాలు సాధారణం. లక్ష్యాన్ని సాధించాలంటే మొదటగా మనం బతికి ఉండాలి. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుంది. మనిషికి చ దువే ముఖ్యం కాదు. చదువుతో పాటు మరెన్నో అవకాశాలున్నాయి. ఓటమి నుంచే గెలుపు వస్తుందనే విషయాన్ని గుర్తించాలి. విద్యార్థులు చనిపోయి కన్నవారికి క్షోభను మిగల్చొద్దు. బతికి సాధిద్దాం అనే సంకల్పంతో ప్రతీ ఒక్కరు ప్రణాళికబద్ధంగా చదివి వారి లక్ష్యాలను సాధించాలి. ముఖ్యంగా ఒత్తిడికి లోనుకాకుండా చూసుకోవాలి.

- డా. సునీల్, మానసిక వైద్య నిపుణులు

ప్రియాంకగాంధీని కలిసిన పెద్దపల్లి ఎంపీ



ప్రియాంకగాంధీతో పెద్దపల్లి ఎంపీ వంశీ

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు, వాయినాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీని గురువారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. అమెరికాలో భారతీయ వలసదారుల పేరిట సంకెళ్లు వేసి విమానాలు ఎక్కించిన విషయంపై ఆయన ప్రియాంకగాంధీతో చర్చించారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయం పై కూడా చర్చించామన్నారు. పార్లమెంట్ పరిధిలోని ప్రాజెక్టుల గురించి చర్చించారు. దేశ ప్రగతి, సంక్షేమమే లక్ష్యంగా జాతీయ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ నేతృత్వంలో ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

భరోసా కేంద్రం ద్వారా బాధితులకు రక్షణ

భరోసా కేంద్రం వార్షికోత్సవం సమావేశంలో డీసీపీ భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

నస్పూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలకు రక్షణ ఉంటుందని, పోలీసులు కూడా అండగా ఉన్నామనే మనోధైర్యం కల్పిస్తున్నామని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. నస్పూర్‌లోని సీసీసీలో భరోసా కేంద్రం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం వార్షికోత్స వ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైనా డీసీపీ భాస్కర్ సిబ్బందితో కలిసి కేక్ కట్ బాధితులతో మాట్లాడి సహాయం అందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలు, బాలికలకు న్యాయం జరిగేలా కృషి చేస్తు న్నామన్నారు. కేంద్రం ద్వారా సమగ్రమైన సహాయాన్ని అందించడానికి, సురక్షి తమైన వాతావరణంలో చేయూత ఇవ్వడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హింస, లైంగిక వేధింపులకు గురైనా పిల్లలు, మహిళలు మరల అటువంటి వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడమే భరోసా కేంద్రం ముఖ్య లక్ష్యమన్నారు. మానసిక పరిస్థితిని తెలుసుకుంటూ బాధితులకు భరోసా కల్పిస్తూ అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, మహిళా స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్, సీసీసీ నస్పూర్ ఎస్సై నెల్కి. సుగు ణాకర్, మంచిర్యాల టౌన్ ఎస్సై వినీత, షీటీం ఎస్సై హైమా, షీ టీమ్, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రాంప్రసాద్

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : కవ్వాల్ టైగర్‌జోన్ ఫారెస్టు పేరుతో జన్నారం మండలంలో విధిస్తున్న ఆంక్షలను తొలగించాలని, ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రాంప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో) కార్యాలయం ముందు నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు, ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా జన్నారం మండల ప్రజలను కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు పేరతో ఆంక్షలు విధిస్తూ ప్రజలను అనేక అవస్థలకు గురి చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, ఆదిత్య, అభిరాం, సంజయ్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎన్ఎస్ఎఫ్ నాయకులు

నేతకానీల ఆత్మగౌరవాన్ని విస్మరించిన సీఎం

జన్నారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నేతకాని జాతి ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించారని , అసెంబ్లీ సాక్షితంగా నేతకాని కులాన్ని 1,33,072 జనాభా మాత్రమే ఉందని ప్రకటన చేయడాన్ని నేతకాని సంఘం తీవ్రంగా ఖండిస్తుందని నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి గంగాధర్ , మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్‌లు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా నుంచి నిజామాబాద్ వరకు సుమారు 18 లక్షల వరకు నేతకాని జనాభా ఉందన్నారు. సీఎం తప్పుడు లెక్కలు చెప్పి నేతకాని కులాన్ని తక్కువ జనాభా కలిగి ఉందని చూపెట్టడం బాధాకరమన్నారు. సమావేశంలో నాయకులు బోర్లకుంట ప్రబుదాస్, జాడి వెంకట్, లక్ష్మణ్, రవిశంకర్, మల్లయ్య, నందయ్య, దత్తు, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతకాని సంక్షేమ సంఘం నాయకులు

సంక్షిప్త సమాచారం

మందమర్రి టౌన్ : సమాజంలో నిరుపేదలకు చేయూ తనివ్వడమే నిజమైన సేవ అని పాస్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం పట్టణంలోని బెతెస్థ ప్రార్థనా మందిరంలో చేపట్టిన కుట్టు మిషన్‌ల పంపిణీలో పాల్గొని మాట్లాడారు.

తాండూర్ : తాండూర్‌లోని అశోక్‌నగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీ టీచర్ కీలు ఖగపతి ఈ నెల 6 నుంచి 20 వరకు ఢిల్లీలోని సీసీఈఆర్‌టీలో జరగుతున్న జాతీయ విద్యా విధానం శిక్షణకు హాజరు కానున్నారు. ఉపాధ్యాయుడిని ఎంఈవో మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అభినందించారు.

మంచిర్యాల కలెక్టరేట్ : ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీఎస్టీ ఈబీసీల్లో డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సులకు ఉచిత శిక్షన అందిస్తున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, బీసీ స్టడీ సర్కిల్ సంచాకులు ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. 08732-221280లో సంప్రదించాలన్నారు.

మందమర్రిరూరల్ : వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. గురువారం అందుగులపేట గ్రామంలో వాటర్ ట్యాంకును పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్, పంచాయతీ కార్యదర్శి వీరేందర్ పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రసాయన ఎరువుల వాడకం తగ్గించి భూసారం పెంచాలని జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఇఫ్కో సంస్థ ఆధ్వర్యంలో సహకార సంఘాల సిబ్బందికి, ఫెర్టిలైజర్ ఇన్పుట్ డీలర్లకు వివిధ పంటల్లో నానో ఎరువులు యాజమాన్యం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలను బలోపేతం చేయడం రైతులకు మేలు జరుగుతుం దన్నారు. ప్రాథమిక సహకార సంఘాల ద్వారా నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. నేరుగా యూరియా, డీఏపీ ఎరువులను కాకకుండా సూక్ష్మ పోషక ఎరువులను కూడా అందిస్తేనే మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతాయ న్నారు. ఇఫ్కో తెలంగాణ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కపా శంకర్ మాట్లాడుతూ దేశంలో 35 వేలకు పైగా ప్రాథమిక సహకార సంఘాలతో భాగస్వామ్యం పొంది ప్రపంచంలో అతి పెద్ద సహకార సంస్థగా ఇఫ్కో రూపొందిందన్నారు.

వ్యవసాయంలో అధిక రసాయన ఎరువులు వినియోగించడం వల్ల నేల సారం తగ్గడమేకాకుండా సమస్యాత్మక నేలలుగా మారుతాయన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఇఫ్కో సంస్థ నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను వాడాలని రైతులకు సూ చించారు. నానో ఎరువులు వాతావరణానికిహానీ చేయకుండా మొక్కలకు కావాల్సిన పోషకాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శివకృష్ణ, మంచిర్యాల ఏడీఏ అనిత, ఇఫ్కో జిల్లా మేనేజర్ శ్రీధర్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి

భూ కబ్జాపై చర్యలు షురూ...!

(5వ పేజీ తరువాయి)

కబ్జాకు గురైనట్లు అధికారులు నిర్ధారించారు. అందులో గతంలో గిరిజనులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన 34 గుంటల భూమి కూడా ఉన్నట్లు తేల్చి, బౌండరీలు ఏర్పాటు చేశారు. కబ్జాకు గురైన 34 గుంటల్లో 10 గుంటలతోపాటు దాని పక్కనే ఉన్న సర్వే నెంబరు 18లోనూ మరో 35 గుంటలు చెరబట్టిన వ్యాపారి ఆ మొత్తం స్థలంలో రైస్ మిల్లును నిర్మించాడు. భూముల సర్వే పూర్తికా వడంతో సంబంధిత నివేదికను తహసీల్దార్ ఐటీడీఏ పీవోకు అందజేశారు. దీంతో స్పందించిన పీవో కబ్జాకు గురైన ఏజెన్సీ భూమిని ప్రభుత్వ కస్టడికి తీసుకోవాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. భూమిని స్వాధీనం చేసుకొనే క్రమంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో ఆ భూమిని కస్టడీలోకి తీసుకునేందుకు మండల రెవెన్యూ అధికారులు సమాయత్తం అవుతున్నారు.

కబ్జాకోరుపై చర్యలు ఉండేనా...?

ఏజెన్సీ భూములు కబ్జాకు గురికావడంతో వాటిని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. త్వరలో భూములను అధికారులు స్వాధీనం చేసుకుంటుండగా, అక్రమంగా కబ్జా చేసిన బడా వ్యాపారిపై కూడా చర్యలు ఉంటాయా..? అన్న సందేహాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. భూమిని కబ్జా చేయడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా రైస్ మిల్లు ఏర్పాటు చేసిన వ్యాపారి మూడు నెలలుగా కలెక్టర్, ఐటీడీఏ పీవో తోపాటు స్థానిక రెవెన్యూ అధికారులను నానా ఇబ్బందులకు గురి చేశాడు. జిల్లా యంత్రాంగం మొత్తం కబ్జాకు గురైన భూములపైనే దృష్టిసారించారు. ప్రస్తుతం భూములను స్వాధీనం చేసుకోవడానికి మార్గం సుగమం కాగా, అధికారుల సమయాన్ని వృథా చేసిన వ్యాపారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి.

మిషన్ భగీరథ పనులను వెంటనే పునరుద్ధరించాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నిలిచిపోయిన మిషన్ భగీరథ పనులను వెంటనే పునరుద్ధరించాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన మిషన్ భగీరథ పైపులైన్‌పనులు అర్థాంతరంగా ఆపివేయడం వల్ల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే, కలెక్టర్‌లు స్పందించి కనెక్షన్‌లు లేని వారికి కనెక్ష న్‌లు ఇచ్చి నీటిని సరఫరా చేయాలని కోరారు.

విదేశీ పెట్టుబడులను వ్యతిరేకించాలి

గర్మిళ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెంచాలనే కేంద్ర ప్రభుత్వ బిల్లును వ్యతిరేకించాలని ఇన్సూరెన్స్ వర్కర్స్ ఆర్గనైజేషన్ కరీంనగర్ డివిజన్ జాయింట్ సెక్రటరీ గెల్లు రవీందర్ తెలిపారు. నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్స్ 19వ త్రైవార్షిక సమావేశం ఈ నెల 9, 10 తేదీల్లో రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరగనుందన్నారు. గురువారం మంచిర్యాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 1200 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో మంచిర్యాల బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు పోచయ్య, రాజేశం, రాజమల్లయ్య పాల్గొన్నారు.

బెల్లంపల్లి చెత్త కాసిపేటలో డంపింగ్

కాసిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి మున్సిపాలిటీలోని చెత్తను కాసిపేట మండలం సోమగూడెం 1ఏ గని సమీపంలో పడేయడం వివాదాలకు దారి తీసింది. గురువారం పది మున్సిపాలిటీల్లో వాహనాల్లో చెత్తను తెచ్చి సోమగూడెం 1ఏ గని సమీపంలో పడేయడానికి వచ్చిన వాహనాలను సామాజిక ప్రజాస్పందన వేదిక కన్వీనర్ సిలోజుమురళీ ఆధ్వర్యంలో స్థానికులు అడ్డుకుని నిరసన తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్ నిర్లక్ష్యంగా మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఇక్కడ పడేస్తున్నామని చెప్పడం అందర్ని ఆశ్చర్యానికి గురి చేసింది. దీంతో స్థానికులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. న్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

పశువుల పాకలు నిర్మించుకోవాలి

భీమారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు పశువుల పాకలు నిర్మించుకోవాలని డీఆర్‌డీవో కిషన్ పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో పోలంపల్లి గ్రామంలో దుర్గం అశోక్, రామయ్య, నక్క రమేష్‌లు నిర్మించుకున్న పశువుల పాకలను ఆయన పరిశీలించారు. ప్రతి యూనిట్‌కు రూ. 85 వేలు మంజూరు చేస్తామని, ఇంకా ఎవరైనా ఆసక్తి గల రైతులు గ్రామపంచాయతీలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో సతీష్, ఏపీవో జీనత్, ఈసీ శ్రీనివాస్, టీఏ శరత్, ఎఫ్ఏ రాజన్న ఉన్నారు.

సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నెన్నెల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపరేషన్ ఎస్ఈ గంగాధర్ గురువారం ప్రారంభించారు. వేసవిలో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు హైపవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇక లోవోల్టేజీ సమస్య ఉండబోదన్నారు. బెల్లంపల్లి డీఈ రాజన్న, ఏడీఈలు శరత్, రవికుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్. రాజన్న, సబ్ ఇంజనీర్ పవన్ పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటిన న్యాయవాదికి సన్మానం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ స్టేడియంలో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన మూడో రాష్ట్రస్థాయి మహిళ న్యాయవాదుల క్రీడా పోటీల్లో బెల్లంపల్లి న్యాయవాద సంఘానికి చెందిన మహిళ న్యాయవాది నల్లుల సంగీత పాల్గొని ప్రతిభ కనబర్చారు. చెస్, పోటీల్లో ప్రథమ విజేతగా నిలిచారు. గురువారం బెల్లంపల్లి కోర్టులో న్యాయవాది సంగీతను కోర్టు జడ్జి ముకేష్, బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, జనరల్ సెక్రటరీ సింగతి రాజేష్, ఏజీపీ చొప్పదండి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు రాము, బాలకృష్ణ, రాజన్న, సాయికుమార్, సందీప్, జుబేర్, స్టాఫ్ రవూఫ్‌పాల్గొన్నారు.

కాటమయ్య కిట్లతో గౌడన్నలకు రక్షణ

జన్నారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కల్లు గీసేందుకు తాటి చెట్లు ఎక్కే గౌడన్నలకు కాటమయ్య కిట్లు ఎంతో రక్షణగా ఉంటాయని కాటమయ్య రక్షణ సేఫ్టీ కిట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బెల్లం కొండ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని బాదంపల్లి గ్రామంలో పలువురు గీత కార్మికులకు లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ సమ్మయ్య ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కిట్లపై ప్రత్యేక ట్రైనర్లతో శిక్షణ ఇప్పించారు. ఎక్సైజ్ ఎస్ఐ మౌనిక, బాదంపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు నాయిని సత్యగౌడ్, మండల అధ్యక్షుడు మూల బాస్కర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రవిగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నర్సాగౌడ్, తిరుపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలో ఈ నెల 12న జరిగే వెంకటేశ్వర స్వామి కళ్యాణంలో భాగంగా గురువారం ఉత్సవ విగ్రహాలను గద్దెరాగడి, తిమ్మాపూర్ ప్రాంతాల్లో ఊరేగించారు. బొక్కలగుట్ట రుష్య ముఖ పర్వతం వద్దకు విగ్రహాలను తీసుకువచ్చారు. గ్రామస్తుడు బలికొండ కిషన్ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు తరలి రావాలని కోరారు.



● న్యూస్ బాక్స్..

బహుజనులను అణిచివేసేందుకు కుట్ర

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో బహుజనులను అణిచివేసేందుకు కుట్ర జరుగుతోందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుక్య రాజు ఒక ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే గణాంకాలు పొంతన లేకుండా ఉన్నాయని ఈ సర్వేను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆశ్రమోన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులతో ఏసీఎంవో ఉద్దవ్ సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం కోసం ఉపాధ్యాయులు కృత్యధార విద్యను విద్యార్థులు అందించాలని, టీచింగ్ డైరీ తప్పకుండా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో క్రీడల అధికారిణి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయులు జంగు, ఆర్పీలు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.


నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయండి

వాంకిడి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి వినయ్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 10న జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

కంది రైతుకు రంది

- పంట చేతికొచ్చే దశలో.. పడిపోతున్న ధరలు
- జిల్లాలో మూడు కొనుగోలు కేంద్రాలు
- ప్రభుత్వ మద్దతు ధర రూ.7550
- ప్రైవేటులో రూ.6,500-6,800 వరకే
- రెండు నెలల క్రితం వరకు 10 వేల వరకు పలికిన ధర
- జిల్లాలో 38,223 ఎకరాల్లో కంది సాగు

ఆరుగాలం కష్టపడి పంచించిన పంట చేతికొచ్చే సమయానికి ధర తగ్గడంతో కంది రైతులు ఆవేదన చెందుతున్నారు. రెండు నెలల క్రితం వరకు 10వేల రూపాయల వరకు పలికింది. జిల్లాలో మూడే కొనుగోలు కేంద్రాలు ఉండడంతో దూరభారంతో పలువురు రైతులు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 7,550 రూపాయలు పలుకుతుండగా దళారులు 6500-6800 రూపాయలు రైతుల చేతిలో పెడుతున్నారు.





చింతలమానేపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కంది పంట చేతికొచ్చే దశలో ధరలు తగ్గుతుండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం ప్రైవేటులో ధర రూ. 6,500 నుంచి 6,800 వరకే అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నట్టుండి సుమారుగా 3,500 వరకు ధరలు తగ్గుతుండడం రైతులను విస్మయానికి గురి చేస్తోంది. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

● లక్ష క్వింటాళ్లపైనే దిగుబడి..

ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో కంది కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లో ప్రారంభం కాగా త్వరలోనే జైనూరులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని జిల్లా అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 7,550తో కొనుగోలు ప్రారంభించారు. జిల్లా పరిధిలో 38,223 ఎకరాల్లో కంది పంటను రైతులు సాగుచేయగా సుమారుగా లక్ష క్వింటాళ్లపైనే దిగుబడి వచ్చే అవకాశం ఉన్నది. విపణిలో కందుల ధర తగ్గిపోవడంతో ప్రభుత్వం ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాలపైనే రైతులు ఆధారపడాల్సి వస్తున్నది.

కాగా మద్దతు ధరతో కందుల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడం రైతులకు ఊరటనిచ్చే అంశంగా ఉంది. తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య (మార్క్‌ఫెడ్) ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టనున్నారు. జిల్లాలో ధరలు తక్కువ ఉండడంతో మహారాష్ట్రకు వెళ్లి అమ్ముకుంటున్నామని రైతులు చెబుతున్నారు. ఇక్కడి కంటే క్వింటాల్‌కు సుమారుగా రూ.200 వరకు అదనంగా వస్తుందని రైతులు చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి..
ప్రవీణ్‌రెడ్డి, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి

జిల్లాలో మూడు కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లో ప్రారంభం అయ్యాయి. త్వరలోనే జైనూరులో ప్రారంభిస్తాం. రైతులు కొనుగోలు కేంద్రాల్లో కంది పంటను విక్రయించుకోవాలి. ప్రభుత్వ ధర రూ. 7,550 చెల్లిస్తున్నాం. దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దు.


కంది పంట

ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి
- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ శాసన మండలి ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికా రి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేవ మందిరంలో ఎస్పీ శ్రీనివాసరావు, సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి సంబంధిత శాఖాధికారులతో కలిసి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల శాసనమండలి సభ్యుల ఎన్నికలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 17 పోలింగ్ కేంద్రాల పరిధిలో 416 మంది ఉపాధ్యాయులు, సుమారు ఆరువేల మంది పట్టభద్రులు ఉన్నారన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని, నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్‌లు, గోడ రాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు చేసి పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రచారాలను నిశితంగా పరిశీలిస్తామని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అవసరమైన అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం
- కలెక్టరేట్ ఎదుట రెండో ఏఎన్‌ఎంల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట రెండో ఏఎన్‌ఎంలు ధర్నా నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ అంజుమ్‌భానుకు సమ్మె నోటీసును అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వెంటనే రెండో ఏఎన్‌ఎం పోస్టులు భర్తీ చేయాలని, వంద శాతం గ్రాస్ సాలరీ ఇవ్వాలని, గ్రాడ్యూటీ, హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉపేందర్, దివాకర్, ప్రమీల, వనిత, పద్మ, జ్యోతి, సత్యవాణి, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీడీ రామకృష్ణ

కెరమెరి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలని యూనిసెఫ్ ప్రతినిధి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలింతలు సైతం రక్తహీనత బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు అధికంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఎంపీడీవో అంజద్‌పాషా, ఏపీఎం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో పోషణ లోపం తగ్గించడం, నివారించడం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో ఏపీడీ రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులకు, వీఓఏలకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో పోషణపై అవగాహన కలిగి ఉండాలని, గ్రామాల్లో ప్రతి ఒక్కరు మహిళా సంఘాల ద్వారా పోషణ లోపం ఉన్న వారిని గుర్తించి వారికి సరైన పోషణ అందేలా అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ ర్యాక్రమంలో ఏపీఎం మోహన్‌లాల్, చంద్రశేఖర్, నాగరాణి, ఏపీఎం దేవానందం, కార్యదర్శులు పాల్గొన్నారు.

చురుకుగా సాగుతున్న ఇందిరమ్మ గృహ నమూనా నిర్మాణం

సిర్పూర్(టి), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నమూనా గృహం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు గురువారం ఏఈ సజియోద్దీన్ పనులను పరిశీలించారు. పనులు పూర్తి అయితే లబ్ధిదారులు ఇదే తరహాలో నిర్మించుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుంది.

డిప్లొమా కోర్సును సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాల, పురుగుల మందు దుకాణదారులు, డీలర్లు సంవత్సర కాలం పాటు నిర్వహించే డిప్లొమా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో మేనేజ్ సమితి, ఆత్మ సౌజన్యంతో ఏర్పాటు చేసిన డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ సర్వీసెస్ ఫర్ ఇన్పుట్ డీలర్(దేశీ) కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లకు సంవత్సరకాలం పాటు ప్రతీ ఆదివారం తరగతులు నిర్వహించి డిప్లొమా సర్టిఫికేట్ అందిస్తామని తెలిపారు. సర్టిఫికేట్ ఉండడం ద్వారా ఎరువుల, విత్తనాలు, పురుగుల మందుల లైసెన్సులు తీసుకోవడానికి అర్హత కలిగి ఉంటారన్నారు. ఎవరైనా కొత్తగా లైసెన్సులు తీసుకోవాలనుకున్న వారు కూడా డిప్లొమా కోర్సు పూర్తిచేసి లైసెన్సులు పొందవచ్చని తెలిపారు. డీలర్లు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై కోర్సును విజయవంతంగా పూర్తిచేసి రైతులకు సరైన సూచనలు అందించాలని, వ్యవసాయాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ మిలింద్, ప్రోగ్రాం ఫెసిలేటర్ సావన్, ఏవోలు మంజుల, రామకృష్ణ, విజయ్, దీప్తి, ఏఈవోలు చిరంజీవి, వెంకటేష్, రాము, డీలర్లు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలోని ప్రధాన కాల్వపై అక్రమ కట్టడాలు వెలిశాయని, వెంటనే వీటిని తొలగించాలని కోరుతూ గురువారం ఇండస్ట్రీయల్ కాలనీ వాసులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూ నాయకులు త్రివేణి, ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అక్రమ కట్టడాలను అధికారులు వెంటనే తొలగించాలన్నారు. నాళాను కబ్జాచేసుకొని ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నా చోద్యం చూస్తున్నారన్నారు. అలాగే బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్టీఆర్ చౌరస్తా మురికి కాల్వను కొంత మంది పూడ్చేసినట్టు తెలిపారు. వీటి స్థానంలో మట్టిపోసి ప్లాట్లు చేసినట్టు పేర్కొన్నారు. సమావేశంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

డిజిటల్ సర్వేకు రైతులు సహకరించాలి


లోనవెల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఏవో గిరీష్

సిర్పూర్(టి), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): యాసంగిలో సాగు చేసే పంటలపై నిర్వహించే డిజిటల్ సర్వేకు రైతులు సహకరించాలని ఏవో గిరీష్ అన్నారు. గురువారం మండలంలోని వెంపల్లి, లోనవెల్లి గ్రామాల్లో యాసంగి పంట సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో సాగుచేసే రైతులు తమ పంటల వివరాలను ఏఈవోల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఈఓలు నేహాతబసుం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యం దిశగా పనిచేయాలి
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్), యాసంగి 2024-25 లక్ష్యాల సాధన దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి భారత ఆహార సంస్థ జనరల్ మేనేజర్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సంచాలకులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు, మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎంఆర్, యాసంగి 2024-25 లక్ష్యాల సాధన దిశగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి ట్యాగింగ్ కలిగిన రైస్ మిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా తరలించాలని తెలిపారు. నిర్దేశిత సీఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా అధికారులు, రైస్ మిల్లర్ల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పౌరసరఫరాల రంగంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమిస్తూ లక్ష్యసాధనకు పూర్తిచేయాలని తెలిపారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని జిల్లాలో అర్హత కలిగిన ప్రతి రైతుకు సంక్షేమ ఫలాలు అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు

ఘనంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదిన వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి జన్మదిన వేడుకలను ఆమె నివాసంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో కేక్ కట్ చేశారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పలువురు అధికారులు, జీఎం శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు వినోద్, అహ్మద్ రక్తదానం చేశారు. పీఏసీఎస్ ఛైర్మన్ అలీబిన్ అహ్మద్, నాయకులు రవీందర్, అన్సార్, నిసార్, రవి, కాసీం తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలోని కుమరం భీం చౌరస్తాలో జరిగిన వేడుకల్లో పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీనివాస్, నాయకులు కమల, లక్ష్మణ్, శ్రీనివాస్, మధుకర్, లచ్చన్న, రాజయ్య, శంకర్, మల్లేష్, బాపు, రమేష్, సత్తయ్య, శ్యాం, రాజమౌళి, కుమార్, సుమన్, రవీందర్, సాయి, అర్జున్ పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు తోడసం ధర్మరావుతో కలిసి కేక్ చేశారు. బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు ఆర్క నాగోరావు, మాజీ సర్పంచులు ఆత్రం ఓంప్రకాస్, సలాం రాజేశ్వర్, తోడసం తిర్మన్‌రావు, నాయకులు పెందోర్ మాధవ్‌రావు, మడావి భోజ్జీరావు, కనక లచ్చు, గజానంద్ పాల్గొన్నారు.

లింగాపూర్: మండలకేంద్రంలో జరిగిన వేడుకల్లో నాయకులు లక్యానాయక్, గనపతినాయక్, రాహుల్, బాపూరావు, గోవింద్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న కుటుంబసభ్యులు

ప్రమాద బీమా చెక్కు అందజేత

బెజ్జూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో ముగ్గురికి కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టల్ సతీష్ గురువారం ప్రమాద బీమా చెక్కును అందజేశారు. మండలంలోని మొగవెల్లికి చెంది న జ్యోతిరావు మృతి చెందడంతో లక్ష రూపాయలు, బొగుడగూడకు చెందిన అల్లూరి లక్ష్మి, కుకుడ గ్రామానికి చెందిన జుమ్మడే తుకారాంలకు రెండు లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ వెంకటేష్, అసి స్టెంట్ మేనేజర్ సాగర్, బీపీఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీపై విమర్శలు చేస్తే ఊరుకోం
- బీజేపీ మండల అధ్యక్షుడు మేస్రాం జ్ఞానేశ్వర్

జైనూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోది ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని బీజేపీ మండల అధ్యక్షుడు మేస్రాం జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం తెలంగాణకు సరైన బడ్జెట్ కేటాయించలేదని కాంగ్రెస్ నాయకులు ప్రధాని మోదీ దిష్టిబొమ్మ. దహనం చేయడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హమీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. నాయకులు మడావి నాగోరావ్, శక్తి కేంద్ర ఇచార్జీ, బిజెవైఎం ఉపాధ్యక్షులు దిలీప్, నాయకులు కుంర గున్వంత్‌రావ్, కొడప నాగోరావ్, గేడాం నగేష్, కుంర దేవరావ్, గేడాం రుపదేవ్, పూసం జ్యోతిరాం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


జైనూర్, దహెగాంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జైనూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుల గణన సర్వే, ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడి, ఉపముఖ్యమంతి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కల చిత్ర పటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జైనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడిమెత విశ్వనాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల పక్షాన ఉండి అనేక సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందని తెలిపారు. రానున్న సర్పంచ్, ఎంపీటీసి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, ఉపాధ్యక్షుడు పెందర్ ప్రకాష్, మాజీ వైస్‌ఎంపీపీ షేక్ రషీద్, నాయకులు మేస్రాం అంబాజీరావ్, సుద్దాల శ్రీనివాస్, సుద్దాల్ ఆనంద్, దండుగుల మహేష్, కోట్నాక దౌలత్‌రావ్, అఫ్రోజ్ ఖాన్, కోవ సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడంతో..

దహెగాం(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇట్యాల నుంచి కేస్లాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.37 కోట్లు, దహెగాం-బొప్పురంకు రూ.3.13 కోట్లు మంజూరు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ దండె విఠల్ చిత్రపటాలకు గురువారం ఇట్యాల, బొప్పురం గ్రామాల్లో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేసిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జయలక్ష్మి, గంగక్క, బ్రహ్మయ్య, శ్రీరామరావు తదితరులు పాల్గొన్నారు.